సాక్షి
కర్నూలు
మంగళవారం • 8 • ఆగస్టు • 2023



కర్ణాటక సీఎంకు ఆహ్వానం

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు బెంగళూరులో శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ నరసింహమూర్తి ఆహ్వాన పత్రికను అందించారు.



ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఫలపుష్పాలతో అలంకరించారు. భక్తులు పిండి వంటలతో నైవేద్యంగా సమర్పించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన బొర్ర సాంబశివరావు రూ.1,00,150 విరాళంగా అందజేశారు.

న్యూస్‌రీల్

11న పొదుపు సంఘాలకు వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలకు సంబంధించి వరుసగా 4వ ఏడాది ప్రభుత్వం ఈ నెల 11న వైఎస్‌ఆర్ సున్నా వడ్డీని విడుదల చేయనుంది. 2019–20 నుంచి పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు సక్రమంగా వడ్డీ, అసలు చెల్లిస్తూ వస్తున్న స్వయం సహాయక సంఘాలకు రూ.3లక్షల రుణాలకు సున్నా వడ్డీ అమలు చేస్తోంది. ఈ నెల 11 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ మొత్తాలను స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలకు విడుదల చేయనున్నారు. ఈ నెల 9న కళ్యాణమస్తు, షాదీతోఫా కింద ఇటీవల వివాహం చేసుకున్న నూతన దంపతులకు ఆర్థిక సహాయాన్ని కూడా ముఖ్యమంత్రి విడుదల చేస్తారని డీఆర్‌డీఏ–వైకేపీ అధికారులు తెలిపారు.

నేడు వలగొండకు ఎస్సీ కమిషన్ చైర్మన్

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదు మంగళవారం ఆస్పరి మండలం వలగొండను సందర్శిస్తారు. ఇటీవల గ్రామంలోని దళిత కుటుంబాలపై కొందరు దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారు. ఈ నేపథ్యంలో ఆయన వచ్చి బాధితులతో మాట్లాడి ధైర్యం చెబుతారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ, ఇతర అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించి తగు సూచనలు ఇచ్చే అవకాశం ఉంది.

పోలీసు స్పందనకు 101 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమానికి మొత్తం 101 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు త్వరిత గతిన న్యాయం చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ యుగంధర్ బాబు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉద్యోగులకు 21 నుంచి 3 రోజుల ప్రత్యేక సెలవులు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఏపీఎన్‌జీవో అసోసియేషన్ మహాసభల్లో పాల్గొనే ఉద్యోగులకు ప్రభుత్వం మూడు రోజుల స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మహాసభలు విజయవాడలో జరుగనున్నాయి. ఈ మహాసభల్లో పాల్గొనే ఉద్యోగులకు ఈ నెల 21 నుంచి 23 వరకు ప్రత్యేక సెలవులు ఇస్తూ ప్రభుత్వం జీవో 1570 జారీ చేసిందని జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్ లాల్ తెలిపారు. జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు పెద్ద ఎత్తున తరలివెళ్లాలని.. మొదటి రోజు మహాసభలకు ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో అడ్మిషన్ల సందడి



అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థినులు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల సందడి నెలకొంది. ఆయా కాలేజీల్లో సీట్లు పొందిన వారు సోమవారం రిపోర్ట్ చేసుకున్నారు. ఇందు కోసం ఆయా కాలేజీల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. సిల్వర్‌సెట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో సీట్ల కేటాయింపు చేశారు. ప్రభుత్వ పురుషుల, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల్లోని కోర్సుల్లో సీట్ల కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 4వ తేదీన ఏపీ ఉన్నత విద్యా మండలి సీట్లు కేటాయించింది. సీట్లు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరై కోర్సు ఫీజులు చెల్లించి కాలేజీల్లో చేరారు. ఈ నెల 10వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



ఖర్జూరాలను మార్కెట్‌కు పంపేందుకు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



కాయలు పాడవకుండా సంచులు కట్టిన దృశ్యం

కరువు నేలలో ఖర్జూర సిరులు!

ఏటా వర్షాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు.. పంట వస్తుందో లేదో అన్న బెంగా అక్కర్లేదు.. భూగర్భంలో ఉండే కొద్దిపాటి నీటికే ఖర్జూర విరగ కాస్తోంది. రైతుల ఇంట సిరులను కురిపిస్తోంది. ఒక్కసారి మొక్కలు నాటుకుని జాగ్రత్తగా నాలుగేళ్లు కాపాడుకుంటే చాలు..75 ఏళ్ల వరకు దిగులే ఉండదు. ప్రతి ఏటా దిగుబడి వస్తూనే ఉంటుంది. మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో మంచి ధర కూడా లభిస్తుంది.

- ఎడారి పంట సాగుపై రైతుల ఆసక్తి
- బనగానపల్లె, మద్దికెర, కోడుమూరు మండలాల్లో సాగు
- నీటి అవసరం తక్కువ.. మొక్కలకే అధిక ఖర్చు
- అయిదేళ్ల తర్వాత దిగుబడులు.. మార్కెట్‌లో మంచి ధర

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతమైన ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొందరు రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికారు. వినూత్నంగా ఖర్జూర సాగు చేపట్టారు. తక్కువ నీటి వనరులతో నికర ఆదాయం పొందేలా ఎడారి పంట పండిస్తున్నారు. ఖర్జూర సాగులో పెట్టుబడి వ్యయం పెద్దగా ఉండదు. మొక్కల ఖరీదు ఎక్కువగా ఉంటుంది. మొత్తం పెట్టుబడిలో 80 శాతం మొక్కలకే ఖర్చు చేయాల్సి ఉంది. ఒక్కసారి సాగు చేస్తే కనీసం 75 ఏళ్ల పాటు దిగుబడులు పొందవచ్చు. కర్నూలు జిల్లాలో మద్దికెర, కోడుమూరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె మండలాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తుండటం విశేషం. ఈత తరహాలో ఉండే ఖర్జూర చెట్లు గరిష్టంగా 20 మీటర్ల వరకు పెరుగుతాయి. వీటిలో ఆడ, మగ ఉంటాయి. ఆడ చెట్లు మాత్రమే ఫలాలను ఇస్తాయి. ఒక మగ చెట్టు నుంచి వచ్చే పరాగరేణువులు 50 ఆడ చెట్లను ఫలవంతం చేస్తాయి. నాటిన ఐదో ఏడాది నుంచే కాపునకు వస్తాయి. అయితే మంచి దిగుబడి ఆరో ఏడాది నుంచి మొదలవుతుంది.



జంబులదిన్నెలో ఖర్జూర తోట



నిగనిగలాడుతున్న గెలలు

ఇవీ జాగ్రత్తలు..

ఖర్జూర సాగుకు ఎర్ర, నల్ల నేలలు అనుకూలం. వీటికి నీటి అవసరం ఎక్కువగా ఉండదు. బోరులో ఇంచు నీళ్లు ఉంటే రెండు ఎకరాల్లో సాగు చేసుకోవచ్చు. ఒక చెట్టు నుంచి గరిష్ఠంగా 100 కిలోలకుపైగా దిగుబడి వస్తుంది. రసాయన ఎరువులు వాడాల్సి అవసరం ఉండదు. పశువుల ఎరువు వేసి దిగుబడి తీసుకోవచ్చు. దిగుబడి వచ్చే సమయంలో గెలలకు సంచులు కట్టుకోవడం మరవకూడదు. లేదంటే గెలలపై తొండలు, పురుగులు తిరగడం.. చిలుకలు కొట్టడం, ఇతర చీడపీడల సోకడం జరుగుతుంది. కొండ, అటవీ ప్రాంతాల సమీపంలో ఖర్జూర సాగు చేస్తే కుందేళ్ల బెడదను నుంచి కాపాడుకోవాల్సి ఉంది.



చెట్టుకు 60 కిలోల దిగుబడి

బనగానపల్లి మండలం జంబులదిన్నె గ్రామానికి చెందిన తుమ్మలూరు సుధాకర్‌రెడ్డి (సెల్‌నం:7013236325) ఆరేళ్ల క్రితం 5.50 ఎకరాల్లో ఖర్జూర సాగు చేశారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల్లో ఖర్జూర సాగును అధ్యయనం చేశారు. తమిళనాడు రాష్ట్రం ఎర్నాకులం ల్యాబ్ నుంచి టిష్యూకల్చర్ ద్వారా అభివృద్ధి చేసిన బర్హి రకం(ఎల్లో) మొక్కలను తెప్పించారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.4500 కాగా, గ్రామానికి చేరేసరికి రూ.5,000 ఖర్చు వచ్చింది. మొత్తం 485 మొక్కలు నాటారు. ప్రస్తుతం ఒక చెట్టుకు సగటున 60 కిలోల వరకు దిగుబడి వస్తోంది. హోల్‌సేల్‌గా క్వింటా ఖర్జూరాలకు రూ.10 వేల ధర లభిస్తోంది. రిటైల్‌గా కిలో రూ.120 నుంచి రూ.140 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న పచ్చి ఖర్జూరాలు బనగానపల్లె మండలం జంబులదిన్నె గ్రామానికి చెందినవి కావడం విశేషం.



'ప్రకృతి' పద్ధతుల్లో సాగు

మద్దికెర గ్రామానికి చెందిన రంగన్న అనంతపురం జిల్లాలోని ఖర్జూర సాగును అధ్యయనం చేశారు. ఆరేళ్ల క్రితం బర్హి రకం(ఎల్లో) మొక్కలు నాటుకున్నారు. ఈయన నేరుగా మొక్కలు తెచ్చుకోలేదు. దళారులను ఆశ్రయించారు. దీంతో మొక్క రూ.3600కే లభించినప్పటికీ నాణ్యత లోపించింది. రెండున్నర ఎకరాల ఎర్ర నేలలో 150 చెట్లు ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన చెట్లలో ఈ ఏడాది దాదాపు 60 కాపునకు వచ్చాయి. ఒక చెట్టుకు 60 కిలోల వరకు దిగుబడి వచ్చింది. పొలం దగ్గరే కిలో రూ.140 ప్రకారం అమ్ముకున్నారు. తక్కువ నీటితోనే ఖర్జూరాలో రాణించవచ్చని రంగన్న నిరూపిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం కోసం ఈయన 8 దేశీవాలి ఆవులను పెంచుతున్నారు. వచ్చే ఏడాది నుంచి చెట్టుకు 100 కిలోలకుపైగా ఖర్జూర వస్తుందనే నమ్మకం ఉందని చెబుతున్నారు.

బర్హి ఎల్లో రకం అనువైనది



జిల్లాలో కొంతమంది రైతులు ఖర్జూర సాగులో రాణిస్తున్నారు. అవగాహన ఉంటేనే సాగు చేపట్టాలి. ఇది ఎడారి పంట కావడంతో వానాకాలంలో చీడపీడలు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అదనపు ఆదాయం కోసం తోటలో అంతర పంటలు సాగు చేసుకోవచ్చు. జిల్లాలోని నేలలకు బర్హి ఎల్లో రకం అనువైనది. ఈ పంటలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. కర్జూర సాగుకు సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపాం.

– రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

రాజకీయ కుట్రతోనే టీడీపీ దాడులు

- ప్రతిపక్ష నేతగా చంద్రబాబు అనర్హులు
- ఆయన జడ్ ప్లస్ సెక్యూరిటీని వెంటనే తొలగించాలి
- చర్చావేదికలో మేధావులు



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్, చిత్రంలో మేధావులు

కర్నూలు(అర్బన్): రాజకీయ కుట్రతోనే పుంగనూరులో టీడీపీ శ్రేణులు దాడులు జరిపి, విధ్వంసకాండ సృష్టించాయని పలువురు మేధావులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనర్హులని తేల్చారు. సోమవారం సాయంత్రం స్థానిక జయశ్రీ హోటల్ సమావేశ హాలులో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అధ్యక్షతన 'అల్లర్లు సృష్టిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెచ్చగొట్టే మాటలు ఎవరి కోసం ... ఎందుకోసం' అనే అంశంపై మేధావులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్.వి.విజయమనోహరి, జిల్లా వ్యవసాయమండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాదులు సువర్ణారెడ్డి, సుబ్బయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, రిటైర్డ్ తహశీల్దార్లు సి.బి.అజయ్‌కుమార్, రోషన్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్, విజయమనోహరి మాట్లాడుతూ.. చంద్రబాబు పర్యటనలో ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో అల్లర్లు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ప్రజా సమస్యలపై పోరాడకుండా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ కుట్రలను మేధావులు, ప్రజలందరూ ఖండించాలన్నారు. పోలీసులు, ప్రజలపై దాడులు చేయిస్తున్న చంద్రబాబుకు జెడ్‌ప్లస్ కేటగిరీ సెక్యూరిటీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, అతని అనుచరులపై అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేయాలన్నారు. చర్చావేదికలో వివిధ వర్గాలు, ప్రజా సంఘాల నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య, వెంకన్న, రాంభీమ్ నాయుడు, మల్లికార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే చేనేతల అభ్యున్నతి





జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పాల్గొన్న చేనేత కార్మికులు

- చేనేత దినోత్సవంలో జెడ్పీ చైర్మన్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే చేనేతల అభ్యున్నతి సాధ్యమైందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైడబ్ల్యూసీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జాతీయ చేనేతల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత కార్మికుల నుద్దేశించి జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే మాట్లాడారు. నేతన్న నేస్తం పథకం కింద మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24వేల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. చేనేతలకు ముడిసరుకు తెచ్చుకునేందుకు రుణాలు సైతం అందిస్తున్నట్లు చెప్పారు. సిల్క్ మగ్గాల సంఖ్య పెంచి యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తోందని ఆరోపించారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించేలా ఆదేశాలిచ్చామన్నారు. దీంతో చేనేత వస్త్రాల విక్రయాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వైడబ్ల్యూసీఎస్ చైర్మన్ బండా నాగరాజుల, కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుట్టా రంగయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, చేనేత సంఘ నాయకులు నీలకంఠ, ఎంకే శివప్రసాద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు భీమిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైడబ్ల్యూసీఎస్ డైరెక్టర్లు పుబ్బతినాగరాజు, సరోజమ్మ, దేవేంద్రప్ప, సురవెంకటేష్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

- సంతృప్తి చెందేలా పరిష్కరించాలి
- కలెక్టర్ డాక్టర్ జి. సృజన



ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకుంటున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన సమస్యలకు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. స్పందన పోర్టల్‌ను ప్రతి రోజూ ఒక్కసారైనా ఓపెన్ చేసి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. సరైన ఎండార్స్‌మెంట్ ఇస్తే అర్జీలు రీ ఓపెన్ కావన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, మల్లికార్జునుడు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన సమస్యల్లో కొన్ని..

- తనకు 16 ఎకరాల భూమి ఉందని, దానిని చుక్కల భూమి జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తుగ్గలి మండలం కడమకుంట్లకు చెందిన సయ్యద్ రాజాసాహెబ్ అర్జీ ఇచ్చారు.
- గ్రామ పొలిమేరలో 6.41 ఎకరాల భూమి ఉందని, దానిని కొందరు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని, వారి నుంచి దానికి విముక్తి కలిగించాలని ఎమ్మిగనూరు మండలం కలుగొట్లకు చెందిన ఎస్. మహ్మద్ హుస్సేన్ విన్నవించారు.
- వెల్దుర్తి మండలం రామళ్లకోట, సర్పరాజుపురం గ్రామాల్లో మిర్చిని సాగు చేసినష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ వినతిపత్రం ఇచ్చారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

పంద్రాగస్టు వేడుకలను పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ సృజన ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వాతంత్య్ర దినోత్సవంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేడుకల్లో భాగంగా పరేడ్‌కు ఏర్పాట్లు చేయాలన్నారు. వేదికను అందంగా తీర్చిదిద్దాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన శకటాలు, ఛాయా చిత్రాల ప్రదర్శనను నిర్వహించాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇచ్చేందుకు అవసరమైన జాబితాను ఆయా శాఖల అధికారులు తయారు చేసి డీఆర్వోకు 12వ తేదీలోపు అందజేయాలన్నారు. ఛాయా చిత్ర ప్రదర్శన, శకటాల వివరాలను 7వ తేదీలో సాయంత్రంలోపు ఇవ్వాలన్నారు.

క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు

కర్నూలు (టౌన్): అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గడువును ప్రభుత్వం సెప్టెంబర్ 30 వరకు పొడిగించింది. జూలై 30 తేదీతో గడువు ముగియగా.. వివిధ మున్సిపాలిటీల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. జిల్లాలో కర్నూలు అర్బన్ డెవలప్ మెంట్ (కుడా) పరిధిలో 630 అక్రమ లేఔట్లను అధికారులు గుర్తించారు. వారందరికీ 2020లో నోటీసులు జారీ చేశారు. అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని లేదంటే వంద శాతం పన్నులు పెంచుతామని, మంచినీటి కుళాయిలు తొలగిస్తామని, మౌలిక సదుపాయాల కల్పనకు బ్రేక్ వేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే వరుసగా రెండేళ్లు కరోనా రావడంతో క్రబద్ధీకరణకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో నోటీసుల మీద నోటీసులు ఇవ్వడంతో ఇప్పటి వరకు 400 అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ముందుకు రాని వారికి మరోసారి నోటీసులు జారీ చేస్తున్నారు. గడువు దాటిన తరువాత అక్రమ లేఔట్లను క్రమబద్ధీకరించుకోని వారిపై శాఖ పరంగా తగిన చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక విభాగం అధికారులు సమాయత్తం అవుతున్నారు.

అనుమతి లేని ప్లాట్లు, భవనాలకు అవకాశం

లేఔట్లతో పాటు ప్లాట్లు కొనుగోలు చేసిన వారు, అనుమతి లేకుండా భవనాలు నిర్మించిన వారు క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అనుమతులు లేని ప్లాట్లు, భవనాలకు భూమి విలువలో 33.33 శాతం జరిమానా, ఖాళీ స్థల పన్ను 14 శాతం చెల్లించాల్సి ఉంటుంది.

నేడు సాగునీటి సలహా మండలి సమావేశం

- హాజరుకానున్న ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు

నంద్యాల(సెంట్రల్): సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో జరగనుంది. ఉమ్మడి జిల్లాలోని కేసీ కెనాల్, తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలు, తెలుగుగంగ, హంద్రీనీవా తదితర ప్రధాన ప్రాజెక్టుల పరిధిలోని కాలువలకు నీటి విడుదలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉండటంతో పాటు, తుంగభద్ర డ్యాం సైతం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరువ కావటంతో త్వరలో నీటి విడుదలపై ఓ నిర్ణయానికి రావొచ్చని సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

టీజీ కుటుంబం ఏ పార్టీలో ఉందో?

- ప్రజలకు చెప్పాలన్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



ర్యాలీలో పాల్గొన్న బీవీ రాఘవులు

కర్నూలు(సెంట్రల్): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కుటుంబ రాజకీయ తీరుపై బీవీ రాఘవులు ధ్వజమెత్తారు. టీజీ భరత్ ఒక్కచోట చంద్రబాబునాయుడుతో ఉన్నట్లు..మరోచోట తండ్రి టీజీ వెంకటేష్‌తో ఉన్నట్లు పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో నింపేశారన్నారు. టీజీ భరత్ టీడీపీలో, వెంకటేష్ బీజేపీలో ఉన్నారని, ఫ్లెక్సీల్లో మాత్రం ఇద్దరు ఉన్నారని, వారు ఏ పార్టీలో ఉన్నారో వారే ప్రజలకు చెప్పాల్సి ఉందన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అంతకముందు బళ్లారి చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్, రాజ్‌విహార్, బుధవారపేట మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఉద్యమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను నిర్మించాలన్నారు. హెచ్ఎస్ఎస్ఎస్ కింద పిల్లల కాలువలను తవ్వి పొలాలకు సాగునీటిని అందజేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 1600 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మూతబడిన పేపర్ మిల్లులను తెరిపించి కార్మికులకు ఉపాధిని కల్పించాలన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, పి.నిర్మలతోపాటు పలువురు కార్మిక, కర్షక సంఘాల నాయకులు మాట్లాడారు.

శిక్షణతో రైతులకు మెరుగైన సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లమో కోర్సు ఎంతో ఉపయోగమని జిల్లా వ్యవసాయ అధికారి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎల్ వరలక్ష్మి తెలిపారు. జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ(మేనేజ్) సహకారంతో జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లమా కోర్సుకు సంబంధించిన తరగతులను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన సమగ్రమైన వివరాలు దేశీ కోర్సు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వారాన్ని ఒక్కరోజు ప్రకారం 48 వారాల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కోర్సు పూర్తి చేసిన వారే రానున్న రోజుల్లో ఇన్‌పుట్ డీలర్లుగా కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. దేశీ కోర్సు సమన్వయకర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ ప్రతి ఆదివారం జరిగే తరగతులకు ఎంపిక చేసిన ఇన్‌పుట్ డీలర్లు హాజరై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెప్పే విషయాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ శ్రీలత, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏలు వెంకటేశ్వర్లు, అరుణకుమారి, వేదమణి, విశ్రాంత డీడీఏలు భగవత్ స్వరూప్, నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మలుపులో అదుపు తప్పి కారు బోల్తా



చికిత్స పొందుతున్న విజయలక్ష్మిని పరామర్శిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి: మలుపువద్ద కారు అదుపు తప్పి బోల్తా పడటంతో అందులో ఉన్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో బంధువుల వేడుకకు హాజరై ఆదివారం రాత్రి వీరు తుగ్గలికి బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన రాతన– తుగ్గలి మధ్యలో రైల్వే స్టేషన్ రోడ్డు దాటగానే మలుపువద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కోడళ్లు రంగమ్మ, సింగిల్ విండో చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మనవరాలు అరుణమ్మ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఎమ్మెల్యే తమ్మారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి గాయపడ్డారు. కారులో ఉన్న బంధువు నితీష్‌రెడ్డి కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో బెలూన్లు తెరుచుకోవడం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, డీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి, పత్తికొండ మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, బంధువులు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

అప్పుల బాధతో రైలు కింద పడి ఆత్మహత్య

తుగ్గలి: అప్పుల బాధతో రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుత్తి రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపిన వివరాల మేరకు.. తుగ్గలి మండలం కడమకుంట్లకు చెందిన రామచంద్ర తన చెల్లెళ్లకు పెళ్లిళ్లు చేసి అప్పుల పాలయ్యాడు. వాటిని ఎలా తీర్చాలన్న బెంగతో సోమవారం గుత్తి నుంచి డోన్ వెళ్లే రైలు మార్గమధ్యలో బసినేపల్లి వద్ద సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సరస్వతి, కూతురు, కుమారుడు ఉన్నారు.

మధురమైన ఉపాధి

- తేనెటీగల పెంపకంలో రాణిస్తున్న అవుకు యువకుడు
- సీజన్‌కు అనుగుణంగా పక్క రాష్ట్రాలకు తేనెపెట్టెల రవాణా
- సంప్రదాయ తేనెకు భిన్నంగా పలు రుచుల మధువు ఉత్పత్తి



పొద్దుతిరుగుడు పొలంలో అమర్చిన తేనె పెట్టెలను చూపుతున్న రమేష్



రమేష్ వద్ద అందుబాటులో ఉన్న పలు రకాల తేనె

నంద్యాల (సెంట్రల్): వినూత్నంగా ఆలోచించి తేనెటీగల పెంపకాన్నే వృత్తిగా మార్చుకుని నికర ఆదాయంతో పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు అవుకు పట్టణానికి చెందిన యువకుడు. ప్రారంభంలో ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయక విపణి మార్పుల్ని ఆకళింపు చేసుకుంటూ తీయని లాభాలు ఆర్జిస్తున్నాడు. అవుకు మండలానికి చెందిన రమేష్ ఆరేళ్ల క్రితం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సాధారణ కంప్యూటర్ శిక్షకుడిగా పనిచేసేవాడు. డిగ్రీ వరకు చదివిన అతడు కుటుంబ పోషణ కోసం అరకొర జీతమైనా సరే సర్దుకుపోయి పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో ఏదైనా వ్యాపారం చేయాలనే ఆలోచన చేస్తుండగా ఓ అధికారి ఇచ్చిన సలహాతో తేనెటీగల పెంపకంపై ఆసక్తి పెంచుకుని కార్యసాధనలోకి అడుగుపెట్టాడు. ముందుగా 2019లో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ సిబ్బందిని కలిసి మెళకువలు పొందాడు. మొదట 8 పెట్టెలు తెచ్చుకుని అవుకులోని ఓ రైతుకు చెందిన చీని తోటలో అమర్చాడు. 6 నెలల పాటు పెద్దగా లాభాలు లేకపోయినా కష్టనష్టాలు తెలుసుకున్నాడు. మరో 40 పెట్టెలు కొనుగోలు చేసి తేనె ఉత్పత్తిని ప్రారంభించాడు. మొదట్లో నెలకు అన్ని ఖర్చులు పోనూ రూ.10 వేల ఆదాయం వచ్చేది. పెట్టెల సంఖ్య పెంచుతూ పోవటం, ఈగల సంఖ్య ఇనుమడించి కొత్త పెట్టెలు తయారవటంతో ఇప్పుడు ఏకంగా 150 పెట్టెలయ్యాయి. ప్రస్తుతం నెలకు అరటన్ను (500 కేజీలు) తేనెను ఉత్పత్తి చేస్తూ సుమారు రూ.50 వేల దాకా స్థిర ఆదాయం పొందుతున్నాడు. ఇప్పటి వరకు తేనెపెట్టెల అమరిక, ఇతర పరికరాల కోసం రూ.4 లక్షలు వెచ్చించాడు. మార్కెట్‌కు కూడా ఇబ్బంది లేకుండా తెలిసిన మధ్యవర్తులే బేరాలు కుదిర్చిపెడుతున్నారు. హోల్‌సేల్‌గా కేజీ రూ.450కి అమ్ముతున్నాడు. మధ్యవర్తులే కాక ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే వారు, బనగానపల్లెలోని ఆయుర్వేద దుకాణదారులు స్వయంగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

సంప్రదాయ పద్ధతులకు స్వస్తి

తేనె అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది...చెట్లు, పుట్టల వెంట తిరిగి పొగ, ఇతర మోటు పద్ధతుల్లో సేకరించే విధానం. దీంతో తేనెటీగల సమూహాల నాశనంతో పాటు కల్తీ, రుచీపచి లేని మధువు లభిస్తుంది. కానీ రమేష్ అనుసరిస్తున్న ఆధునిక తేనెపెట్టెల పద్ధతిలో పర్యావరణానికి హాని కలగని రీతిలో పలు ఫ్లేవర్ల తేనె లభ్యమవుతోంది. దీని కోసం అతడు కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా సీజన్‌ను బట్టి పలు రాష్ట్రాలు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు ట్రక్కుల్లో తీసుకువెళ్లి ఈ తేనెపెట్టెల్ని అమరుస్తున్నాడు. ఇందులో భాగంగా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో ప్యాపిలి మండలం ఎస్.రంగాపురం, సంజామల మండలం పేరుసోమల గ్రామాల్లోని పొద్దుతిరుగుడు, ఉల్లి పంటల వద్ద పెట్టెల్ని అమర్చి తేనె ఉత్పత్తి చేస్తున్నాడు. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు రాజస్థాన్‌లో ఆవాలు, ధనియాలు పూత దశలో ఉంటాయి. దీంతో అక్కడికి పెట్టెల్ని రవాణా చేసి అమర్చుతున్నాడు. తిరిగి మార్చి, ఏప్రిల్‌లో సంగమేశ్వరంలోని శ్రీశైలం జలాశయం వెనక జలాల్లో ఖాళీ అయ్యే పొలాల్లో సాగు చేసే నువ్వుల పంటల వద్ద తేనె సేకరిస్తున్నాడు. అనంతరం మహారాష్ట్రకు వెళ్లి అక్కడి రేగు, జామూన్ తోటల్లో అమర్చటానికి పెట్టెల్ని తరలిస్తున్నాడు. ఇంతటితో ఆగకుండా ఏకంగా పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోని కల్కా వద్ద మల్టీ ఫ్లవర్ తేనె ఉత్పత్తిని సైతం చేపట్టాడు.

ఆసక్తి ఉంటే సాయం చేస్తా



తేనెటీగల పెంపకం ఓ లాభసాటి ఆదాయ మార్గం. నేను మొదట్లో ఒక్కో పెట్టెకు రూ.2 వేల రాయితీపై ఉద్యానశాఖ తరపున 8 పెట్టెల్ని తెచ్చుకున్నాను. ఇలా మొత్తం 90 దాకా కొన్నాను. ఈగల సంఖ్య ఎక్కువై ఇప్పుడు 150 అయ్యాయి. ఒకే రకం తేనె కాకుండా తులసి, బెర్రీ(రేగు), అకేషియా, నేరేడు, మల్టీఫ్లవర్, ఆవాలు, ధనియాల రుచుల తేనెలు ఉత్పత్తి చేస్తున్నాను. తేనెటీగల్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేయాలంటే పెట్టెల్ని సర్దటానికి కేవలం రాత్రిపూట మాత్రమే వీలవుతుంది. మొదట్లో కూలీలు రాత్రిపూట పనికి వచ్చేందుకు సంకోచించేవారు. దీంతో మా తమ్ముడు నాగరాజుతో కలిసి ఇద్దరమే పని చేసుకునే వాళ్లం. సంవత్సరంలో 9 నెలలు పుష్కలంగా తేనె ఉత్పత్తి ఉంటుంది. నెలకు రూ.2.25 లక్షల విలువ చేసే తేనె ఉత్పత్తి చేస్తున్నాను. జిల్లావ్యాప్తంగా తేనెటీగల పెంపకంపై ఎవరికైనా ఆసక్తి ఉంటే అన్నివిధాలుగా సాయం అందించి తోడ్పడుతాను. ప్రస్తుతం ఉద్యానశాఖతో పాటు నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ అధికారులు భారీ రాయితీలతో పరికరాలు అందిస్తున్నారు.

– రమేష్, తేనెటీగల పెంపకందారుడు, అవుకు

స్వాతంత్య్ర వేడుకలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థిని జీవమణి

ఓర్వకల్లు: విజయవాడలో ఈనెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఓర్వకల్లు మోడల్ స్కూల్ విద్యార్థిని జీవమణి ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ జోషిలావాట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15న స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అందుకుగాను పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని డి.జీవమణి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ఎంపికకు కృషి చేసిన పీఈటీ శేఖర్‌ను, విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈగా శివకుమార్

కర్నూలు(హాస్పిటల్): ఏపీఎంఎస్‌ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా శివకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఎండి మురళీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలోని ఏపీఎంఎస్‌ఐడీసీలో క్వాలిటీ కంట్రోల్ ఈఈగా పనిచేస్తున్న ఆయనను కర్నూలుకు బదిలీ చేశారు. గత కొంత కాలంగా కర్నూలులో ఈఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌ఛార్జిగా నంద్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. రెండురోజుల్లో శివకుమార్ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

లారీ బోల్తా పడి డ్రైవర్ మృత్యువాత

డోన్ టౌన్: మండల పరిధిలోని చింతలపేటకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు (43) ప్రమాదంలో మృతి చెందాడు. డోన్ నుంచి లోడ్‌తో కర్ణాటకలోని జిందాల్ ఫ్యాక్టరీకి వెళ్లాడు. ఆదివారం రాత్రి ఫ్యాక్టరీలో అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడికి భార్య కుళ్లాయమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సోమవారం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. విషయం తెలుసుకున్న డోన్ లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, లారీ యజమాని తిమ్మారెడ్డి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కంప్యూటరీకరణతో లావాదేవీల్లో పారదర్శకత



సమావేశంలో మాట్లాడుతున్న కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): కంప్యూటరీకరణతో సంఘాల లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. సోమవారం కేడీసీసీబీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో చైర్‌పర్సన్ పీఏసీఎస్‌ల రుణాల పంపిణీ, కంప్యూటరీకరణ, పీఏసీఎస్‌లను మల్టీ సర్వీస్ సెంటర్లుగా మర్చు చేయడం, కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని సంఘాలకు అవసరమైన బడ్జెట్ కేటాయించామని, రుణాల పంపిణీని వేగవంతం చేయాలని సూచించారు. బకాయిలు ఎక్కువగా ఉన్న సంఘాల్లో రికవరీలను ముమ్మరం చేయాలని చైర్మన్‌లు, సీఇవోలను ఆదేశించారు. సమిష్టిగా పనిచేయడం వల్ల డీసీసీబీకి వరుసగా 3వ సారి రాయలసీమ స్థాయిలో బెస్ట్ డీసీసీబీ అవార్డు వర్చిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు పురస్కారం అందుకున్న చైర్‌పర్సన్ విజయమనోహరి, సీఇవో రామాంజనేయులును సత్కరించారు. జిల్లాలో ఉత్తమ సహకార సంఘాలుగా ఎంపికై ఆప్కాబ్ ద్వారా అవార్డులు పొందిన ఉల్చాల పీఏసీఎస్ చైర్మన్ వంశీధర్‌రెడ్డి, సీఇవో హరినాథరెడ్డిలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పాలకవర్గం సభ్యుడు సీమ సుధాకర్‌రెడ్డి, డీసీవో ఎస్.రామాంజనేయులు, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీజీఎంలు సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఆప్కాబ్ డీపీడీఎం సహిదా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

వారు ఉద్యోగులా.. టీడీపీ కార్యకర్తలా?



మాట్లాడుతున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్: శాతనకోట గ్రామంలో లస్కర్లుగా పనిచేస్తున్న రామసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శంకర్‌గౌడ్‌లు 98 జీవో ఉద్యోగులా లేక టీడీపీ కార్యకర్తలా అని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, శాతనకోట గ్రామ సర్పంచ్ జనార్దన్‌గౌడ్ ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో లస్కర్లు తమ విధులు నిర్వహించకుండా ప్రధాన ప్రతి పక్షం అయిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లా మారిపోయారన్నారు. గ్రామాల్లో నిర్వహించే పార్టీ సమావేశాల్లో కూడా పాల్గొంటూ తమ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్, ఎల్లెల్సీలో పని చేసే వీరు పార్టీ సమావేశాలకు, పాదయాత్రలకు వెళుతూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. వీరిపై ఆయా శాఖలకు సంబంధించిన ఏఈ, డీఈలకు పలు మార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి లస్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పబ్బతి రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

లారీడ్రైవర్ అనుమానాస్పద మృతి



రామన్న (ఫైల్)

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరానికి చెందిన డ్రైవర్ రామన్న (రాముడు) (45) కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఈనెల 5న అనుమానాస్పదంగా మృతిచెందాడు. మృతుని సోదరుడు శ్రీనివాసులు కర్ణాటక పోలీసులకు అందించిన ఫిర్యాదు మేరకు... రామన్న డోన్‌కు చెందిన లారీకి డ్రైవర్‌గా పదేళ్ల క్రితం నుంచి పనిచేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ తోటి డ్రైవర్ కమ్ క్లీనర్ జయరాంరెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి పశువులలోడ్‌తో బెంగళూరుకు వెళ్లాడు. అన్‌లోడింగ్ అనంతరం తిరిగి లోడింగ్ కోసం బెంగళూరు సమీప చింతామణి గ్రామ మార్కెట్‌కు వచ్చాడు. అక్కడ పశువుల లోడ్ తదుపరి రోజుకు వాయిదా పడడంతో మార్కెట్ ప్రాంతంలోనే లారీ ఆపి తోటి డ్రైవర్‌తో కలిసి భోజనం చేశాడు. టీ తాగి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. తోటి డ్రైవర్ ఇది గుర్తించక నిద్రలోకి జారుకున్నాడు. ఉదయాన్నే గమనిస్తే రామన్న తిరిగి రాకపోవడంతో, సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వస్తుండడంతో వెతికాడు. అప్పటికే చింతామణి మార్కెట్‌లో రామన్న గాయాలతో మృతి చెందిన విషయాన్ని గుర్తించిన మునిసిపాలిటీ వర్కర్లు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గుర్తుతెలియని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. తోటి డ్రైవర్ విషయం తెలుసుకుని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని సోదరుడు శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు చింతామణి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

19న 42 వార్డులు, ఒక సర్పంచ్ స్థానానికి ఉప ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని ఖాళీగా ఉన్న 42 గ్రామ పంచాయతీ వార్డులు, కౌతాళం మండలం బదినేహాల్ సర్పంచ్ స్థానానికి ఆగస్టు 19వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆగస్టు 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదే రోజున ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ఏ గ్రామంలో ఉంటాయో అక్కడ మాత్రమే ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. సోమవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణంలో లక్ష్యం మేరకు పురోగతి లేకపోవడంతో దేవనకొండ ఎంపీడీఓకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని ఆదేశించారు. అలాగే పనితీరు సక్రమంగా లేని పత్తికొండ, ఆలూరు, కృష్ణగిరి, గూడూరు మండలాలకు చెందిన 10 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకజ్ నోటీసులు జారీ చేయాలని, వీరిలో పత్తికొండ –2 సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయాలని కలెక్టర్ పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యంను ఆదేశించారు. వెల్దుర్తి ఇంజినీరింగ్ అసిస్టెంట్ తనకు కేటాయించిన 85 గృహాల్లో ఒక్కటి కూడా పూర్తి కాకపోవడంతో అతని జీతాన్ని నిలుపుదల చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌ను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ జీఓ నంబర్ 133 ప్రకారం ఏర్పాటైన మండల స్థాయి సమన్వయ కమిటీలు ప్రతి శనివారం సమావేశం కావాలన్నారు. ఆ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను మినిట్స్ రూపంలో సోమవారంలోపు జిల్లా కమిటీకి అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్లుప్తంగా

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా ఎవరైనా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. వెల్దుర్తి మండల పరిధిలోని బ్రహ్మగుండం వద్ద సర్వే నంబర్ 894లో ఉన్న భూమిలో మద్దయ్య అనే వ్యక్తి ఎలాంటి లైసెన్స్, అనుమతి లేకుండా మట్టి తీసుకెళ్తున్నాడనే సమాచారంతో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారని డీడీ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ సర్వే నంబర్‌లో 15 మీటర్లు పొడవు, 5 మీటర్ల వెడల్పుతో మట్టి తవ్వినట్లు గుర్తించారని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి ఎంత మేర నష్టం జరిగిందని అంచనా వేసి మద్దయ్యపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సుబ్బరామయ్య

బనగానపల్లెరూరల్: ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన డి.సుబ్బరామయ్య (32) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామం సమీపంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటున్న ఇతను స్లాబ్‌కు క్యూరింగ్ చేసేందుకు సోమవారం ఉదయం వెళ్లాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తూ పైన ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబీకులు బనగానపల్లె ప్రభుత్వవైద్యశాలకు తరలించగా అప్పటికే సుబ్బరామయ్య మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సుధామణి, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి ముర్తుజావలి(39) అనే వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు శివుడు పొలంలో ట్రాక్టర్ రోటామీటర్‌తో సేద్యం చేశాడు. సేద్యం పూర్తయ్యాక గట్టుపై నిలిపి రోటామీటర్ చక్రాల్లో ఇరుక్కున్న మట్టిని తొలగిస్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ వెనుకకు వచ్చింది. మట్టి తీస్తున్న డ్రైవర్, యజమాని ముర్తుజావలిపై టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న శివుడికి టైరు తగలడంతో గాయపడి స్పృహ తప్పి కింద పడ్డాడు. సమీపంలోని పొలాల రైతులు గమనించి ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేష్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ ఏసయ్య పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. భార్య రేష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌లు ఢీ .. ఒకరు దుర్మరణం



గాయపడిన రామాంజనేయులు

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే 44పై పాత షరీఫ్‌దాబా సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో కల్లూరు మండలం కొంగనపాడు యువకుడు తెలుగు రామాంజనేయులు (37) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరు మండలం కొంగనపాడు రామాంజనేయులు(37) మామిడి పళ్ల వ్యాపారస్తుడు. బైక్‌పై గోవర్ధనగిరి వెళ్లి తిరిగి వెళ్తున్నాడు. అదే రూట్‌లో కృష్ణారెడ్డి బైక్ వెళ్తున్నాడు. ఇద్దరి బైక్‌లు ఢీకొనడంతో రామాంజనేయులుకు తీవ్రంగా, కృష్ణారెడ్డికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న హైవే పోలీసులు 108లో క్షతగాత్రులు ఇద్దరినీ కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక రామాంజనేయులు మృతిచెందాడు. స్వల్ప గాయాలపాలైన కృష్ణారెడ్డి 108 వాహనం కర్నూలు చేరుకోగానే దిగి కనిపించకుండా పోయినట్లు సమాచారం.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు సోమవారం అధికసంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకున్నారు. శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం నేపథ్యంలో భక్తుల రద్దీతో దర్శన క్యూలన్నీ నిండిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు దర్శనానికి బారులుదీరడంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం భక్తులు అన్నపూర్ణభవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.